క్లుప్తంగా

నేడు లయన్స్ క్లబ్‌లో యోగా దినోత్సవం

పార్వతీపురం: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పట్టణంలోని లయన్స్ క్లబ్‌లో బుధవారం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ నిషాంత్ కుమార్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. లయన్స్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. 21వ తేదీన ఉదయం 6 గంటలకు యోగా కార్యక్రమం ప్రారంభమవుతుందని ప్రకటనలో స్పష్టం చేశారు. మానసిక, శారీరక ప్రశాంతతకు, ఆరోగ్యానికి యోగా ఎంతగానో దోహదం చేస్తుందని ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాలు యోగాను అవలంబిస్తూ అంతర్జాతీయ యోగా దినోత్సవం జరుపుకుంటున్నాయని పేర్కొన్నారు.

నారు మడి తయారీపై రైతుల దృష్టి



వరినారు మడిని చదును చేస్తున్న రైతు

సీతానగరం: ఇటీవల కురిసిన వర్షాల కారణంగా ఖరీఫ్ వరిసాగుకు అవసరమైన వరినారు మళ్లను తయారు చేయడంలో మండలంలోని రైతులు నిమగ్నమయ్యారు. నాలుగు రోజులుగా అడపాదడపా కురుస్తున్న వర్షంతో పాటు సోమవారం గట్టి వర్షం కురవడంతో వరినారు మళ్లను తయారుచేస్తున్నారు. అలాగే వరియదలు వేయనున్న పొలాల్లో దుక్కి చేస్తున్నారు. ఈ విషయమై ఏఓ ఎస్.అవినాష్ వద్ద ప్రస్తావించగా వర్షాధార భూముల్లో రైతులు వరియదలు వేయడానికి అవసరమైన తేలిక పాటి రకం వరి విత్తనాలు పంపిణీ చేయడానికి సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. మండలంలో 2 వేలనుంచి 2,500 ఎకరాల్లో వరియదలు వేయడానికి రైతులు సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు.

ఎమ్మార్సీకి చేరిన మనబడి నాడు నేడు మెటీరియల్



ఎమ్మార్సీకి వచ్చిన మెటీరియల్

సీతానగరం: మనబడి నాడు నేడు పథకంలో భాగంగా 'ఫేజ్'2' నిధులతో మండలంలో జరుగుతున్న పాఠశాల భవనాలలో అభివృద్ధికి అవసరమైన మెటీరియల్ మండల విద్యావనరుల కేంద్రానికి మంగళవారం చేరింది. భవన నిర్మాణాలు పూర్తి కావస్తున్న నేపథ్యంలో వాటిలో అమర్చడానికి అవసరమైన వివిధ రకాల మెటీరియల్ రావడంతో ఎంఈఓ జి.సూరిదేముడు వద్ద ప్రస్తావించగా 5 ఉన్నత పాఠశాలలకు, మూడు ప్రాథమిక పాఠశాలలకు ,అంగన్వాడీ భవనాలకు అవసరమైన మెటీరియల్ వచ్చిందని చెప్పారు. ఇప్పటికే నాడు నేడు పథకం ద్వారా పాఠశాలల్లో పనులు వేగవంతం చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఆధ్వర్యంలో సమీక్షా సమావేశం జరిగినట్లు చెప్పారు.


నవధాన్యాల కిట్ల పంపిణీ



రైతులకు నవధాన్యాల కిట్లు అందజేస్తున్న ఏఓ ప్రసాద్

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని గొయిపాక రైతుభరోసా కేంద్రంలో 25 మంది రైతులకు మండల వ్యవసాయాధికారి సీహెచ్ ప్రసాద్ నవధాన్యాల కిట్లను మంగళవారం పంపిణీ చేశారు. వర్షాలు అనుకూలంగా ఉండటం వలన ఈ విత్తనాలను పొలంలో వేసుకోవాలని సూచించారు. నవధాన్యాల సాగుతో భూమి సారవంతం అవుతుందని, ప్రధాన పంటలకు అవసరమైన అన్ని రకాల సూక్ష్మ, స్థూల పోషకాలు సమృద్ధిగా లభిస్తాయని అన్నారు. ఫలితంగా ఏవిధమైన రసాయన ఎరువులు వాడాల్సిన అవసరం ఉండదని, దిగుబడి కూడా పెరుగుతుందని వివరించారు. కార్యక్రమంలో వీఏఏ కె.భవాని, సీఆర్‌పీ కె.మిన్నారావు తదితరులున్నారు.

ఆర్‌బీకేలకు చేరిన ఎరువులు



కొండాపురం ఆర్‌బీకేకు చేరిన ఎరువులు

పాలకొండ: వ్యవసాయ రంగానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోంది. ఈ ఏడాది ఖరీఫ్ కోసం ముందుస్తుగా ఏర్పాట్లు పూర్తి చేసింది. ఇప్పటికే రైతులకు వరి విత్తనాలు పంపిణీ చేసింది. జిల్లాలో సుమారుగా 27వేల క్వింటాళ్ల వరి విత్తనాలు వ్యవసాయశాఖ అధికారులు అందించారు. ప్రస్తుతం ఎరువుల పంపిణీకి చర్యలు చేపడుతున్నారు. రైతుల డిమాండ్‌కు అనుగుణంగా డీఏపీ, యూరియా ఆర్‌బీకేలకు చేరుతున్నాయి. ఎరువులు కావాల్సిన రైతులు ఆర్‌బీకేల్లో సంప్రదించాలని ఏఓ వై.వాహిని సూచించారు.

వేడుకగా రథయాత్ర



ప్రత్యేక పూజలు అందుకుంటున్న జగన్నాథస్వామి

సాలూరు: ఆషాడ శుద్ధ విదియ మంగళవారం జగన్నాథస్వామి రథయాత్ర మంగళవారం వేడుకగా ప్రారంభమైంది. పట్టణంలో జగన్నాథస్వామికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. జగన్నాథస్వామి ఆలయం నుండి ప్రారంభమైన ఈ రథయాత్ర డీలక్స్ సెంటర్ నుండి కోటవీధి మీదుగా సూర్యమహల్ జంక్షన్‌కు సాయంత్రం చేరింది. అక్కడ గుండిచా మందిరం వద్ద స్వామివారికి తొమ్మిది రోజులు భక్తులు పూజలు చేయనున్నారు. గర్భాలయంలో ఉన్న విగ్రహమూర్తులే రథం మానుపై తిరువీధులలో తిరుగుతుండడంతో భక్తుల కోలాహలం నడుమ స్థానికంగా ఆధ్యాత్మికతతో కూడిన సందడి వాతావరణం నెలకొంది. ఆలయ అర్చకులు విజయ్‌పాత్రో, వినయశర్మ శాస్త్రోక్తంగా పూజలు చేశారు. అంతకుముందు ఆలయ ధర్మకర్తలు విక్రమ సన్యాసిరాజు తదితరులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

జై జగన్నాథ్..!

• రథయాత్ర ఉత్సవానికి పోటెత్తిన భక్తులు

పార్వతీపురంటౌన్: పట్టణంలో జగన్నాథ రథయాత్రను భక్తి శ్రద్ధలతో మంగళవారం నిర్వహించారు. పట్టణంలోని జగన్నాథ స్వామి ఆలయం నుంచి గుండించా మంటపం వరకు ఉత్సవ మూర్తులను ఊరేగించారు. ఏటా రథంపై ఉత్సవ మూర్తులను ఊరేగించగా ఈ ఏడాది రథం మరమ్మతుల కారణంగా తాత్కాలిక రథంపై ఊరేగించారు. గుండించా మంటపం వద్ద స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు క్యూబారులు దీరారు. తొమ్మిదిరోజుల పాటు ఉత్సవాలను నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. వచ్చే ఏడాది నుంచి రథంపై రథయాత్రను నిర్వహించనున్నట్లు ఎండోమెంట్ అధికారి ప్రసాదరావు చెప్పారు.



స్వామివారిని దర్శించుకునేందుకు క్యూలో వేచి ఉన్న భక్తులు

వైఎస్సార్ క్రీడా పాఠశాలలో ప్రవేశానికి ఎంపిక



జిల్లా క్రీడల చీఫ్ కోచ్ ఎస్.వెంకటేశ్వరరావు

పార్వతీపురంటౌన్: రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆదేశాల మేరకు డాక్టర్ వైఎస్సార్ క్రీడా పాఠశాల కడపలో 2023–24 అకడమిక్ సంవత్సరానికి 4, 5వ తరగతులలో బాల బాలికల ప్రవేశం నిమిత్తం ఈ నెల 24న ఎంపిక నిర్వహిచనున్నట్లు జిల్లా క్రీడల చీఫ్ కోచ్ ఎస్.వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. పార్వతీపురం మన్యం జిల్లా బాలబాలికల జిల్లా స్థాయి ఎంపిక కార్యక్రమం ఈ నెల 24న స్థానిక బెలగాం ఆర్‌సీఎం స్కూల్‌లో ఉదయం 9 గంటల నుంచి నిర్వహిస్తామని పేర్కొన్నారు. నాలుగవ తరగతిలో 20మంది బాలురు, 20మంది బాలికలు, ఐదవ తరగతిలో ఏడుగురు బాలురు , నలుగురు బాలికలు మొత్తం 51 ప్రవేశాలకు ఎంపికలు నిర్వహిస్తామన్నారు. 4 వ తరగతి ప్రవేశానికి బాల బాలికలు 1 ఆగస్టు 2023 నాటికి 8 సంవత్సరాలు వయస్సు పూర్తయి 9సంవత్సరాల లోపు ఉండాలన్నారు. 5 వ తరగతి ప్రవేశానికి బాలబాలికలు 1 ఆగస్టు 2023 నాటికి 9 సంవత్సరాలు వయస్సు పూర్తయి 10 సంవత్సరాల లోపు ఉండాలని తెలిపారు. మండల స్థాయిలో ఎంపికైన వారు షెడ్యూల్‌లో పొందుపరిచిన విద్య, జనన, మండలస్థాయి డేటా షీట్‌తో హాజరు కాగలరని తెలిపారు. మరిన్ని వివరాలకు కె.గణేష్, హ్యాండ్ బాల్ కోచ్ – 9866805716, బి.రవి, వెయిట్ లిఫ్టింగ్ కోచ్ – 9666929309, బి.ఈశ్వరరావు, బాక్సింగ్ కోచ్–9908353692 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

ఆకట్టుకున్న హఠయోగా క్రియలు



జలప్లావని విద్యను ప్రదర్శిస్తున్న వంగపండు శ్రీరాములు మాస్టారు

సాలూరు: మండలంలోని డా. బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ వంగపండు శ్రీరాములు మంగళవారం నిర్వహించిన హఠయోగా క్రియలు అందరిని విశేషంగా ఆకట్టుకున్నాయి. బుధవారం యోగా దినోత్సవం నేపథ్యంలో స్థానిక ఉపాధ్యాయులు, విద్యార్థుల కోరిక మేరకు యోగాలో విశేష ప్రావీణ్యం ఉన్న శ్రీరాములు మంగళవారం ప్రత్యేక ప్రదర్శలు వేశారు. పాఠశాల ఆవరణలో భూసమాధి (వాయు స్తంభన) ప్రక్రియలో భాగంగా గాలి చొరబడని విధంగా రేకులు, ఇటుక, ఇసుకలతో తీసిన గోతిలో సుమారు 45 నిమిషాలు ఉండి బయటకు వచ్చారు. అనంతరం కొత్తవలస గ్రామ సమీపంలో ఓ చెరువులో నీటి మీద తేలి ఉండే (జలప్లావని) విద్యను ప్రదర్శించారు.ఈ సమయంలో ఆయన అనేక ఆసనాలు వేశారు.

విద్యార్థుల ఆరోగ్యంపై దృష్టి సారించాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఐఓ డాక్టర్ టి.జగన్‌మోహన్‌రావు

• డీఐఓ డాక్టర్ టి.జగన్‌మోహన్‌రావు

పార్వతీపురంటౌన్: విద్యార్థుల ఆరోగ్యంపై సిబ్బంది దృష్టి సారించాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి(డీఐఓ) డాక్టర్ టి. జగన్‌మోహన్‌రావు సూచించారు. ఈ మేరకు ఆయన పట్టణంలోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాల, ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలను మంగళవారం సందర్శించారు. విద్యార్థుల ఆరోగ్యాన్ని పరిశీలించారు. వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు పునఃప్రారంభమైన నేపథ్యంలో విద్యార్థుల ఆరోగ్యంపై వసతి గృహ సిబ్బంది, వైద్య సిబ్బంది పర్యవేక్షణ ఉండాలని స్పష్టం చేశారు. విద్యార్థులతో ఆయన మాట్లాడి సెలవుల్లో ఎవరికైనా ఎటువంటి అనారోగ్య సమస్యలైనా తలెత్తాయో అని, ప్రస్తుత ఆరోగ్యంపై అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు ఆరోగ్యంపై ఉన్న అవగాహన పరిజ్ఞానాన్ని పరీక్షించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు ఆరోగ్య సూచనలు చేశారు. చర్మ సంబంధిత వ్యాధులు దరిచేరకుండా ఎక్కువగా జాగ్రత పడాలని అందుకు వ్యక్తిగత పరిశుభ్రత చాలా అవసరమని సూచించారు. చేతికి గోళ్లు లేకుండా ఉంచాలని, ఆహారం తీసుకునే ముందు, కాలకృత్యాల తర్వాత చేతులను సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలని హితవు పలికారు. నీరు ఎక్కువగా తాగాలని చెప్పారు. రక్తహీనత, సీజనల్ వ్యాధులు, పౌష్టికాహారం, రోగ నిరోధకశక్తి ఇలా పలు అంశాలపై వివరించి అవగాహన కల్పించారు. విద్యార్థులకు ఏ చిన్న అనారోగ్య సమస్య వచ్చినా వెంటనే వైద్య సిబ్బంది దృష్టికి తీసుకురావాలని డీఐఓ జగన్‌మోహన్‌రావు సూచించారు. ఇందులో ప్రధానోపాధ్యాయులు పి.చినమోహన్ రాయుడు, ఏటీడబ్ల్యూఓ పట్నాయక్, వైద్య సిబ్బంది జయగౌడ్, పార్వతి, పాఠశాల, వసతి గృహ సిబ్బంది పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ ఉద్యోగులందరినీ క్రమబద్ధీకరించాలి



వైఎస్సార్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులు

గుమ్మలక్ష్మీపురం: ప్రభుత్వ శాఖలలో పనిచేసే కాంట్రాక్ట్ ఉద్యోగులందరికీ మేలు చేసేలా అందరినీ రెగ్యులరైజేషన్ చేయాలని పలువురు కాంట్రాక్ట్ అధ్యాపకులు డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో ఉన్న వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. జూన్ 2, 2014 నాటికి ఐదేళ్ల సర్వీసు పూర్తయి ఉండాలనే నిబంధనను సడలించాలని, ఆ రోజు వరకు పనిచేస్తూ, నేటికీ కొనసాగుతున్న కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజేషన్ చేయాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ ఉద్యోగులతో త్వరలో ప్రభుత్వం ఒక సమావేశం ఏర్పాటు చేసి తమ అభిప్రాయాలను ఆలకించాలని కోరారు.

సీఎం సభకు తరలిరండి



గుమ్మలక్ష్మీపురం: పార్టీ నాయకులతో మాట్లాడుతున్న ఎంపీపీ దీనమయ్య

గుమ్మలక్ష్మీపురం: అమ్మఒడి నిధుల విడుదలకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఈనెల 28న కురుపాం నియోజకవర్గానికి వస్తున్నారని, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీపీ కుంబురుక దీనమయ్య అన్నారు. మంగళవారం తన ఛాంబర్ వద్ద పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులతో సమావేశమై కార్యక్రమం ఏర్పాట్లపై చర్చించారు. ప్రతీ కార్యకర్త సీఎం సభకు హాజరుకావాలని సూచించారు. అలాగే సభకు హాజరయ్యే విద్యార్థులు, వారి తల్లులకు, పార్టీ అభిమానులకు ఏలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలన్నారు.

సమావేశంలో వైస్ ఎంపీపీలు నిమ్మక శేఖర్, లక్ష్మణరావు, రజక కార్పొరేషన్ డైరెక్టర్ గోరిశెట్టి గిరిబాబు, ఎస్సీ, ఎస్టీ సెల్ మండల కన్వీనర్లు సామల మాధవరావు, తోయక గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

కురుపాం: ఈ ఏడాదికి సంబంధించి అమ్మఒడి నిధులు విడుదల చేసేందుకు కురుపాం వస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ఘన స్వాగతం పలికేందుకు పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు తరలిరావాలని, సీఎం బహిరంగ సభను విజయవంతం చేయాలని ఎంపీపీ శెట్టి పద్మావతి, జెడ్పీటీసీ గొర్లి సుజాత పిలుపునిచ్చారు. సభకు వచ్చేవారికి ఎటువంటిఆ అసౌకర్యం కలగకుండా చూసుకోవాలని పార్టీ కార్యకర్తలకు సూచించారు. సమావేశంలో కురుపాం సర్పంచ్ గార్ల సుజాత, ఉప సర్పంచ్ ఆదిల్, వైస్ ఎంపీపీ బిడ్డిక అన్నాజీరావు, ఎంపీటీసీలు గాదు సంతోషిరాణి, వెలమల బంగారునాయుడు, పీఏసీఎస్ అధ్యక్షుడు కె.గౌరీశంకరరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

డిగ్రీలో నూతన విద్యావిధానంపై అవగాహన

గుమ్మలక్ష్మీపురం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సింగిల్ మేజర్ సబ్జెక్టులపై ప్రిన్సిపాల్ డాక్టర్ టి.శ్రీవరం మంగళవారం విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. నూతన విద్యా విధానంలో భాగంగా ఈ ఏడాది నుంచి డిగ్రీ స్థాయిలో సింగిల్ మేజర్ విధానాన్ని రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ప్రవేశపెట్టిందన్నారు. ఈ విధానం ప్రకారం స్థానిక కళాశాలలో బీఏలో మేజర్ సబ్జెక్టుగా పొలిటికల్ సైన్స్, మైనర్ సబ్జెక్టు ఎకనామిక్స్‌ను, సీబీజెడ్ గ్రూపులో బోటనీ మేజర్ సబ్జెక్టు, కెమిస్ట్రీ మైనర్ సబ్జెక్ట్, ఎంపీసీఎస్ గ్రూపులో కంప్యూటర్ సైన్స్ మేజర్ సబ్జెక్ట్ కాగా, మ్యాథ్స్ మైనర్ సబ్జెక్ట్‌గా బోధన చేపట్టనున్నట్లు చెప్పారు. ఈ విధానంలో మొదటి సంవత్సరం మాత్రమే చదివితే సర్టిఫికెట్, రెండో సంవత్సరం వరకూ చదివితే డిప్లమా సర్టిఫికెట్, మూడేళ్లు పాటు చదివితే బ్యాచిలర్ డిగ్రీ సర్టిఫికెట్, నాలుగో ఏడు కూడా కొనసాగితే డిగ్రీ ఆనర్స్ సర్టిఫికెట్‌ను విద్యార్థికి ప్రదానం చేయడం జరుగుతుందన్నారు. 2023–24 విద్యా సంవత్సరానికి గాను అడ్మిషన్ల ప్రక్రియ ఈనెల 19 నుంచి ప్రారంభమైందని, కళాశాలలోనే ఉచితంగా రిజిస్ట్రేషన్స్ చేస్తున్నామని, ఈనెల 24తో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ముగుస్తుందన్నారు. ఇతర వివరాలకు 9490459917, 8331817710 నంబర్లకు సంప్రదించాలని కోరారు.

జగనన్న సురక్ష అమలుకు సిద్ధం



మాట్లాడుతున్న ఎంపీడీఓ ఎం.ఎల్.ఎన్ ప్రసాద్

సీతానగరం: ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న సురక్ష పథకం ద్వారా అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు, అపరిష్కృతంగా ఉన్న సమస్యలు ఇంటింటికి వెళ్లి తెలుసుకుని పరిష్కరించడానికి సిబ్బందిని సమన్వయపరిచి సమస్యలు పరిష్కరించడానికి సమాయత్తం అవుతున్నామని ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న సురక్ష పథకం ద్వారా వివిధ శాల అధికారుల సమన్వయంతో సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు ఇంటింటికీ వెళ్లడం ప్రజలు పొందుతున్న సంక్షేమపథకాలు, అర్హత ఉండీ ఏరకమైన ఇబ్బందులు పడుతున్నారు? సంక్షేమ పథకాలు అమలు కాక ఇబ్బందులు ఎందుకు పడాల్సి వస్తోందో సర్వేలో తెలియనుందన్నారు. సంబంధిత మండలస్థాయి అధికారులు సమస్యలను పరిష్కరించడానికి ఈ నెల 24 నుంచి జగనన్న సురక్ష పథకం అమలులోకి వస్తుందన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాలను అనుసరించి నిర్దేశించిన నాటినుంచి గ్రామాల్లో సర్వే చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ సహాయకుడు నానిబాబు పాల్గొన్నారు.

కౌలు పత్రాలపై అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ శ్రావణ్

బలిజిపేట: కౌలు రైతులు పత్రాలను ఏవిధంగా పొందాలి, యజమానులు వారికి ఏషరతులతో ఇస్తారనే దానిపై అవగాహన సదస్సును ఏఓ శ్రావణ్ ఆధ్వర్యంలో రైతులకు మంగళవారం నిర్వహించారు. ఈ మేరకు బలిజిపేట రైతుభరోసా కేంద్రం వద్ద ఏఓ శ్రావణ్ ఆధ్వర్యంలో సదస్సు ఏర్పాటు చేశారు. యజమాని, సాగుదారు మధ్య ఉండే ఒప్పందం పత్రం ఇది అని ఈ సందర్భంగా ఏఓ శ్రావణ్ తెలిపారు. దీని కాలపరిమితి 11నెలలు ఉంటుందన్నారు. పంట రుణాల అందుబాటు, పంటల బీమా ఉపశమనం, వడ్డీ పెట్టుబడి రాయితీ, రైతు భరోసా సాయం వంటి ప్రయోజనాలు కౌలు రైతులకు అందుబాటులోకి వస్తాయన్నారు. దీనిని గ్రామ రెవెన్యూ అధికారి సంతకంతో ఇస్తారని చెప్పారు. భూయజమాని పేరు, సాగుదారు పేరు, సర్వే నంబర్, పంట కాలం వంటి వివరాలు అందులో ఉంటాయని, రైతులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

లచ్చయ్యపేటలో డ్రైనేజీలు,కాలువల నిర్మాణం



కాలువ పనులను పరిశీలిస్తున్న జెడ్పీటీసీ ఎం బాబ్జీ. నిర్వాహకుడు తవిటినాయుడు.

సీతానగరం: మండలంలోని లచ్చయ్యపేట గ్రామానికి గడపగడపకు మన ప్రభుత్వం పథకం ద్వారా విడుదలైన రూ.20 లక్షలతో అభివృద్ధి పనులు ఇంజినీరింగ్ అధికారుల పర్యవేక్షణలో జరుతున్నాయని జెడ్పీటీసీ ఎం బాబ్జీ అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఆధ్వర్యంలో గ్రామంలో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లిన సమయంలో ప్రజలు ఎదుర్కొంటున్న సామాజికపరమైన సమస్యలను గుర్తించి రూ.20 లక్షలతో పనులు మంజూరు చేశామని తెలిపారు. ఆయా పనులు సర్పంచ్ సీహెచ్ కృష్ణ, ఇంజినీరింగ్ సహాయకుడు అశోక్ ఆధ్వర్యంలో జరుగుతున్నాయని తెలియజేశారు. ఇప్పటికే ఎస్సీ కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణం పూర్తయిందని, వృథానీటిని మళ్లించడానికి కాలువల నిర్మాణం జరుగుతోందని తెలిపారు. నిర్వాహకుడు ఆర్.తవిటినాయుడు మాట్లాడుతూ కాలువల పనులు పూర్తయిన వెంటనే రెండు కల్వర్టుల నిర్మాణం చేపట్టనున్నట్లు చెప్పారు.

గ్రామ అభివృద్ధికి సహకరించండి



మాట్లాడుతున్న సాగి ప్రత్యేకాధికారి రాజ్‌కుమార్

• సాగి ప్రత్యేకాధికారి రాజ్‌కుమార్

పాచిపెంట: పాచిపెంట గ్రామాభివృద్ధికి ప్రజలు, ప్రజా ప్రతినిధులు సహకరించాలని సాగి(సంసాద్ ఆదర్శ గ్రామ యోజన) ప్రత్యేకాధికారి రాజ్ కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని స్థానిక కమ్యూనిటీ భవనం వద్ద గ్రామ సర్పంచ్ పాచిపెంట సంతోషి అధ్యక్షతన మంగళవారం గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంసాద్ ఆదర్శ గ్రామ యోజన కింద పాచిపెంట గ్రామాన్ని అరకు పార్లమెంట్ సభ్యురాలు గొడ్డేటి మాధవి ఎంపిక చేశారన్నారు. కార్యక్రమానికి ప్రత్యేకాధికారిగా కలెక్టర్ నిశాంత్ కుమార్ తనని నియమించారని, గ్రామాల్లో ఎలాంటి సమస్యలు ఉన్నా తెలియజేయాలన్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ గ్రామంలో రహదారుల అభివృద్ధి, మురుగునీటి కాలువ నిర్మాణం, వీధి దీపాల ఆధునీకరణ, శ్మశాన వాటికల నిర్మాణం, ఇంటింటికి తాగునీటి కుళాయిలు ఏర్పాటు తదితర సమస్యలు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ బి.ప్రమీల, వైస్ ఎంపీపీ నారాయణమ్మ, స్థానిక ఎంపీటీసీ దండి ఏడుకొండలు ఎంపీడీవో పార్వతి, ఈఓపీఆర్‌డీ తదితరులు పాల్గొన్నారు.

బాలిక మృతిపై ఆరా



లిడియా మృతిపై వైద్య సిబ్బందిని ఆరా తీస్తున్న ఎంపీపీ ప్రమీల

పాచిపెంట: మండలంలోని కేసలి పంచాయతీ కుంతాం గ్రామానికి చెందిన పెదకాపు లిడియా అనే ఐదేళ్ల గిరిజన చిన్నారి విషజ్వరంతో బాధపడుతూ విశాఖ కేజీహెచ్‌లో సోమవారం రాత్రి మృతి చెందింది. దీనిపై పాచిపెంట ఎంపీపీ బడ్నాన ప్రమీల మంగళవారం ఉదయం స్థానిక పీహెచ్‌సీకి వెళ్లి వైద్య సిబ్బందిని ఆరా తీశారు. లిడియాకు ఈనెల 14వ తేదీన జ్వరం రావడంతో తండ్రి పెదకాపు రమణ 15వ తేదీన పాచిపెంట పీహెచ్‌సీకి తీసుకువచ్చారని, వైద్య పరీక్షల అనంతరం మందులు తీసుకుని ఇంటికి తీసుకెళ్లిపోయారని వైద్యులు తెలిపారు. మళ్లీ 18వ తేదీన జ్వరం రావడంతో ఆశ వర్కర్ సహాయంతో సాలూరు సీహెచ్‌సీకి తీసుకెళ్లాదని, అక్కడ చికిత్స పొందుతున్న సమయంలో ఫిట్స్ రావడంతో అక్కడ వైద్యులు వెంటనే విజయనగరం తరలించారన్నారు. పరిస్థితి విషమంగా ఉండడంతో అక్కడి నుంచి అదేరోజు రాత్రి కేజీహెచ్‌కు తరలించగా కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. అనంతరం ఏఎన్ఎంలతో ఎంపీపీ సమావేశం నిర్వహించారు. వర్షాకాలంలో ఏజెన్సీలో విషజ్వరాలు ప్రబలే అవకాశం ఉందని, ప్రజలను చైతన్యవంతం చేస్తూ.. మరోవైపు ముందస్తు వైద్య సేవలు అందించాలని సూచించారు. గిరిజన గ్రామాల ప్రజలు చిన్నపాటి జ్వరం వచ్చినా చేతబడి చేశారంటూ వైద్యసేవలు పొందరని, వైద్యసేవలు పొందేలా అవగాహన కల్పించాలన్నారు. వైద్య రంగానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందని, ఊరూరా నిర్వహించే ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకునేలా గిరిజనులను చైతన్యవంతం చేయాలన్నారు. ఆమె వెంట వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పాచిపెంట వీరంనాయుడు, వైద్యాధికారి రవిచంద్ర, సీహెచ్ఓ శోభారాణి ఉన్నారు.